చిన్న కథ

# నా పాడెకొమ్మున కొట్టుకుంటనా!

ఎలికట్టె శంకరరావు

సల్లబొట్టుకాడ మాఅమ్మ పెద్దగా పట్టించుకునేది కాదు గని యెన్నపూస మీద మాత్తరం యీగ ఆలనిచ్చేది కాదు. రొట్టెల మీద మా తమ్మునికింత నా కింత యేసి ముద్దకు ముద్ద వో గురిగిల యేసి వుట్టిమీదేసేది.

మాఅమ్మ బెయానికి యెలుకలు కూడా మల్లిసూడవు కదా!

అట్ల నాలుగైదు రోజులు కూడబెట్టినం వొకరోజు బాగా కాగబెట్టి అటికల బోసేది నెయ్యి. ఆ రోజు మాత్తరం మాకు బలే సంబురం. తేట తేట నెయ్యి అటికల బోసి, అడుగున వున్న గశ్శి అట్లనే వుంచితే అదే అందరం రొట్టె మీద యేసుకొని ముక్కులతో మ్ మ్ మ్... అని వాసన యెగబీల్సుకుంట తినెటోల్లం.

మాఅమ్మ మాత్తరం నెయ్యటిక మూతికి గుడ్డ బిగిచ్చి రొన్నెల్లకో మూన్నెల్లకో వొచ్చే తుర్కాయినకు అమ్మేది.

ఓనాడు గడుపట్ల కూసొని అద్దంల సూస్కుంట శిగేసుకుంటున్న మాఅమ్మను సూసి 'అమురతమా వొస్తవా? నేచ్చుక్క కొంటబోతున్న నల్లగొండకు' అన్నది రింగ రింగ బోతున్న మా శెంద్రమ్మత్త.

ఊల్లె యిర్లై రూపాలు బెడ్తే నల్లగొండల తుర్కిండ్లల్ల తిరిగమ్మితే ముప్పై రూపాలు వొస్తయి గదా అని మా శెంద్రమ్మత్త యెప్పుడూ నల్లగొండల్నే అమ్ముకొస్తది.

మా బర్రె పాలిచ్చిన కాన్నుంచి రొండుసార్లు అమ్మినా వూల్లెనే అమ్మింది మాఅమ్మ. నల్లగొండకు యెప్పుడూ పోలే. ఎన్న ముందు ఆడుకుంట 'తుర్కిండ్లల్ల నేను నెగుల్తనంటవా శెంద్రమా' అన్నది మాఅమ్మ.

'నేను లేనా?' అని మా శెంద్రమ్మత్త బరోసా యియ్యంగనే 'యిగో కాగబెట్టే వుంది. కూసేపట్ల సర్వల పోసుకొని వొస్త' అని లేసింది. అంత దూరం బోయి అమ్మితే కిరాయిలు బోను వో పది రూపాలన్న మిగలక పోతయా అని.

మాఅమ్మ నెయ్యి అమ్మినా, కోడిపిల్లను అమ్మినా పైసలు శెక్కుడు సంచిల యేసుకొని బొడ్లె దోపుకుంటది గని మా నాయినకు యిచ్చేది కాదు. అప్పుడప్పుడు యింట్లె నుంచి అయిదు మానుకలో కుండడో గని వొడ్లు కూడా అమ్మేది మా నాయినకు తెల్వకుంట. ఆ పైసలు యేంజేసేదో యేమో మరి యెవలికి తెల్వక పోయేది.

ఓ పొంటెసేపు నడిసి బస్సెక్కి మాఅమ్మ నల్లగొండల నేచ్చుక్క అమ్మి గస పెట్టుకుంట పొద్దూకంతల యింటికొచ్చింది. శేతుల సర్వను ఆడబెట్టి గుండుచెంబుతో గుండు చెంబుడు నీల్లు గడగడా తాగి శీర కొంగుతో మొకానికి పట్టిన శెమటను తూడ్సుకొని నిమ్మల పడ్డది.

నా కండ్లన్ని మాఅమ్మ శేతుల సంచి మీదనే. ఎంత దుర్బినేసి సూసినా కుక్కి కుక్కి వున్న చే సంచిల యేమీ కనబడలే.

'అమా! అమా' అనుకుంట మా పావురంగా మాఅమ్మ మొకాన్ని రొండు చేతులకు తీసుకొని గీములాడినా 'ఆగురా నాయినా నడ్సి నడ్సి కాళ్లు పీక్కపోతున్నయ్' అని మూలిగింది సాప మీద అడ్డ మొరిగి.

మా అక్క వొచ్చి 'అమా నెయ్యి అమ్ముడు బోయిందా?' అని పలకరించింది.

మాఅమ్మ కుశాలుగా లేసి కూసొని 'యింక పది కిలోలున్నా అమ్ముడుబోయేది. నల్లగొండ తుర్కోల్లు మన నెయ్యి సూసి యెంత కాయిశు చేసింద్రని? బస్సు దిగి వో సందులకు బోయినం. ఆడ వొక బుర్కామె వుంటె నెయ్యి కావాల్నా అని అడిగిన.

ఆమె యేదో బాసల మాట్లాడి సూపియ్యమన్నది.

నేచ్చుక్క అట్ల చెయ్యిమీద యేసుకొని మూర్కజూసింది. కాకిరి బీకిరి అన్నది. అంతే నలుగురయిదుగురు ఆడోల్లు నాకంటె నాకని ఎగబడ్డరు. తీస్కబోయిన రొండు కిలోల నెయ్యి వోల్ల ముక్కుల కొస్తది? కూసేపట్ల పైసలందుకొని బెయిట బడ్డ.

